క్లుప్తంగా

రైతులకు మొక్కలు పంపిణీ



రైతులకు మొక్కలను పంపిణీ చేస్తున్న సీఎస్ఏ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆదినారాయణ

వేంపల్లె : సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో వేంపల్లి, వేముల మండలాల్లోని రైతులకు మొక్కలు పంపిణీ చేసినట్లు సీఎస్ఏ స్టేట్ కో ఆర్డినేటర్ ఆదినారాయణ తెలిపారు. గురువారం ఆయా మండలాల్లో 18 మంది రైతులకు 5524 మొక్కలను పంపిణీ చేశారు. సెట్రిస్ సహకారంతో మామిడి, నిమ్మ, అంజూర, కొబ్బరి, జామ, సపోటా, నేరేడు, ఎర్రచందనం మొక్కలను ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. ఒక ఎకరా భూమిలోనే ఐదు రకాల పండ్ల మొక్కలు నాటుకోవడం వలన ఆరు నెలలకే ఆదాయం పొందవచ్చునన్నారు. రైతులు మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల మొక్కలను రక్షిస్తే ఆర్థికంగా ఎదగవచ్చునన్నారు. కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ కో ఆర్డినేటర్ అనిత, పీఓలు, ఎఫ్‌పీఓలు, రైతులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం



ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో అలాగే ఉన్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పేరు

పులివెందుల రూరల్ : పట్టణంలోని అంబకపల్లె రోడ్డు సమీపంలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయానికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పేరు ఉండేది. ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ తీసివేసి ఎక్సైజ్ శాఖ పేరు మార్చి 20 రోజులవుతున్నా అధికారులు నిర్లక్ష్యం కారణంగా బోర్డును అలాగే ఉంచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎక్సైజ్ శాఖ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైకల్య పరికరాలకోసం పరిశీలన



దివ్యాంగులను పరిశీలన చేస్తున్న ఎంపీడీవో

కొండాపురం : అర్హులైన దివ్యాంగులకు వైకల్య పరికరాలు అందిస్తామని ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని వికలాంగులను ఆయన పరిశీలించారు. సుమారు 130 మంది పరీక్షలకు హాజరైనట్లు దివ్యాంగుల జిల్లా పర్యవేక్షక అధికారి అనిల్ తెలిపారు. ఎంపికైన దివ్యాంగులకు నెలలోపు వైకల్య పరికరాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సౌకర్యార్థం వైకల్య పరికరాలు కృత్రిమ కాళ్లు, చేతులు, ట్రైసైకిళ్లు తదితర పరికరాలను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఓబులేసు రామయ్య, గండ్లూరు నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువులో తల్లిదండ్రుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇందిర

పెండ్లిమర్రి : విద్యార్థులు చదువులో బాగా రాణించాలంటే తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర తెలిపారు. గురువారం పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల అభ్యసనా, ప్రగతి, తరగతులు హాజరు ఇతర అంశాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వేంపల్లె : పరిశుభ్రత, స్వచ్ఛతపై స్థానిక ప్రజలకు గురువారం స్వామివివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి తెలిపారు. గరుగువీధిలోని ప్రజలకు విద్యార్థులు పరిశుభ్రతే ఆరోగ్యానికి ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అలాగే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ర్యాలీ నిర్వహించారు. 400 గృహాలకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు.

నిరుపయోగంగా టీటీడీ కల్యాణ మండపం



నిరుపయోగంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం



దెబ్బతిన్న వివాహ వేదిక

- కొత్త కల్యాణ మండపం నిర్మించాలంటున్న ప్రజలు
- మండపంలో ఆగిన కల్యాణాలు

జమ్మలమడుగు రూరల్ : నేడు సాధారణ మధ్యతరగతి ప్రజలు ఇళ్ల వద్ద వసతులు లేకపోవడంతో కల్యాణ మండపాల్లో వివాహాలు చేసుకోవాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రైవేట్ కల్యాణ మండపాల్లో వివాహాలు చేసుకోవాలంటే లక్షలాది రూపాయలు పెట్టవలిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కల్యాణ మండపాలకు బాడుగలతోపాటు మెయింటెన్స్ పేరిట వేల రూపాయలు నిర్వాహకులు దోచుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. ఒక సాధా సీదా వివాహాలు చేసుకోవాలన్న రూ.2 లక్షలు ఖర్చు అవుతుందంటున్నారు. పట్టణంలో



కూలడానికి సిద్ధంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం స్లాబ్

సుమారు 7 కల్యాణ మండపాలు ఉన్నాయి.

కూలడానికి సిద్ధంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం

నాటి దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ స్థానిక ఎమ్మెల్యే పొన్నపురెడ్డి శివారెడ్డి హయాంలో జమ్మలమడుగు పట్టణంలో మొట్ట మొదటి సారిగా ఒక ఎకరా 25 సెంట్లలో టీటీడీ కల్యాణ మండపం నిర్మించి ప్రారంభించారు. రూ.2,800 బాడుగ చెల్లిస్తే అందులోనే కుర్చీలు, వంట పాత్రలు ఇచ్చేవారు. దీంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వివాహాలను ఈ కల్యాణ మండపంలో చేసుకొనేవారు. అయితే కాలక్రమేణా కల్యాణ మండపం స్లాబ్ దెబ్బతిని పెచ్చులు పడుతుండటంతో నిరుపయోగంగా మారింది. 2019 నుంచి టీటీడీ కల్యాణ మండపంలో వివాహాలు చేసుకోవడానికి టీటీడీ అధికారులు ఆన్‌లైన్ బుకింగ్ కూడా క్లోజ్ చేశారు.

కొత్త కల్యాణ మండపం నిర్మించాలి



36 సంవత్సరాల క్రితం నిర్మించిన టీటీడీ కల్యాణ మండపం పూర్తి స్థాయిలో దెబ్బతిని ఉంది. అధికారులు పూర్తిగా పడగొట్టి వాటి స్థానంలో కొత్త కల్యాణ మండపం నిర్మిస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు చాల ప్రయోజనకరంగా ఉంటుంది. కొత్త కల్యాణ మండపానికి ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

-భూతమపురం సుబ్బారావు, న్యాయవాది, జమ్మలమడుగు

అధికారులు పరిశీలించి వెళ్లారు

దెబ్బతిన్న టీటీడీ కల్యాణ మండపాన్ని 2 నెలల క్రితం టీటీడీ అధికారులు పరిశీలించి నివేదిక తీసుకుని వెళ్లారు. త్వరలోనే దెబ్బతిన్న కల్యాణ మండపం స్థానంలో మరో కల్యాణ మండపాన్ని నిర్మించే అవకాశం ఉంది.

- మోహన్ టీటీడీ అధికారి

గుర్రంగుంపు స్టాక్ పాయింట్‌ను నీటితో నింపండి

చింతకొమ్మదిన్నె : మండలంలోని గుర్రంపు ప్రాజెక్టును నీటితో నింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి ఎమ్మెల్యేను కోరారు. కొలుములపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయంలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ వందరోజుల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. అలాగే మండలంలోని గుర్రంగుంపు ప్రాజెక్టును నీటితో నింపేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌కు సన్మానం

వేంపల్లె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నామినేటెడ్ పోస్టుల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డిని గురువారం ఆ పార్టీ నాయకులు సన్మానించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే బీజేపీలో చేరి సర్పంచ్‌గా పనిచేసి రెండుసార్లు జిల్లా అధ్యక్షుడిగా, ఒకసారి రాష్ట్ర కార్యదర్శిగా, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల కల్తీని కనుగొనే విధానంపై అవగాహన



కల్తీని కనుగొనే పద్ధతులను వివరిస్తున్న కళాశాల విద్యార్థులు

పులివెందుల టౌన్ : స్థానిక బ్రాహ్మణపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు ఆహార పదార్థాల కల్తీని కనుగొనే విధానంపై అవగాహన కల్పించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు అతి సులువుగా పాలు, నెయ్యి, పసుపు, ఎండు మిర్చి కారం, ఉప్పు, మిర్యాలు, టీ పొడి మొదలగు ఇతర ఆహార పదార్థాల కల్తీని కనుగొనే వివిధ పద్ధతులను ప్రదర్శన చేసి చూపించారు. కార్యక్రమంలో గ్రామ దత్తత కార్యక్రమ చైర్మన్ డాక్టర్ ఎం.కీర్తి రెడ్డి, మెంబెర్ డాక్టర్ పి.జయమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్టాబ్లిష్‌మెంట్ కో ఆర్డినేటర్‌గా సుధాకర్‌రెడ్డి



ఎస్టాబ్లిస్‌మెంట్ కో ఆర్డినేటర్‌గా సుధాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న అధ్యాపకులు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎస్టాబ్లిష్‌మెంట్ కో ఆర్డినేటర్‌గా ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.వి.సుధాకర్ రెడ్డిని నియమించినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. గురువారం డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆయన తన చాంబర్‌లో బాధ్యతలను స్వీకరించారు. అలాగే ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా మ్యాథ్స్ విభాగంలో మెంటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జె.దీప్తి నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణతో ఉంచి ఉన్నతస్థాయి చదువులను అభ్యసించే విధంగా నడుచుకుంటామన్నారు. వారిని నియమించడం పట్ల అధ్యాపకులు, అధ్యాపక సిబ్బంది వారిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, డీన్ అకాడమిక్స్ రమేష్ కైలాస్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ వెంకటేష్, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తంలో హిమోగ్లోబిన్ పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు రక్త నిర్ధారణ పరీక్షల నిర్వహిస్తున్న డాక్టర్ ప్రత్యూష, తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఎన్.ఎస్.ఎస్ యూనిట్-1, 2, అంకాలమ్మపేట ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ పి.ప్రత్యూష హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె విద్యార్థులకు రక్తంలోని హిమోగ్లోబిన్, న్యూట్రిషన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి మాట్లాడారు. శరీరంలోని అన్ని అవయవాలకు ఆక్సిజన్‌ను హిమోగ్లోబిన్ సరఫరా చేస్తుందని. వివిధ కారణాలవల్ల హిమోగ్లోబిన్ తగ్గిపోవడం మానవునికి ప్రాణాపాయంగా మారుతుందన్నారు. హిమోగ్లోబిన్ తగ్గితే రక్తహీనత సమస్య వస్తుందన్నారు. మాంసకృత్తులతోపాటు ఐరన్ లభించే పండ్లతోపాటు ఆకు కూరలను విధిగా ఆహారంలో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల పీఆర్ఓ డాక్టర్ సి.బాలనారాయణ, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈసీని తరలించొద్దని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈసీని కడప నుంచి తరలించొద్దని డీవైఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని స్థానిక పాతబస్టాండ్‌లో ఉన్న గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ కొప్పర్తి మెగ ఇండస్ట్రియల్ హబ్ అనుసంధానంగా మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ టెక్నాలజీ టెస్టింగ్ సెంటర్ కేంద్ర ప్రభుత్వం ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం అమరావతికి తరలించడం దారుణమన్నారు. తరలింపునకు వ్యతిరేకంగా తీసుకుని వచ్చిన జీవో నంబర్ 56ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నాటి ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కడప సమీపంలో కొప్పర్తి మెగ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు కృషి చేశారన్నారు. ఇప్పుడు రాయలసీమ ప్రాంత ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు అమరావతికి తరలించడం రాయలసీమ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారన్నారు. అమరావతిలో మరో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని కేంద్రం నుంచి తెచ్చుకోవాలని సూచించారు.

కొర్ర ధర పతనం.. రైతులకు నష్టాలు



బి. కొట్టాలపల్లె గ్రామంలో కొర్ర కోత కోస్తున్న యంత్రం

కొండాపురం : జీవన శైలిలో ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. తినే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొర్రలకు అధిక ప్రదాన్యం ఇస్తున్నారు. కొండాపురం మండలంలో 225 ఏకరాలు సాగు చేశారు. అంతరపంటగా సాగు చేసిన పొలాల్లో ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్లవరకు అలాగే పూర్తిస్థాయిలో సాగు చేసిన పొలాల్లో 7 క్వింటాళ్ల వరకు చేతికి వస్తుందని రైతులు అంచన వేస్తున్నారు. పంట దిగుబడి బాగున్నా ధర లేక పోవడంతో కొర్రసాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొర్రలను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులు ఆసరాగా చేసుకుని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది క్వింటాకు ధర రూ.5 వేల నుంచి 6 వేలవరకు పలికింది. ప్రస్తుతం రూ.2500 ధరతో దళారులు కొనుగోలున్నారు. ప్రభుత్వం కొనుగోలు లేకపోవడంతో దళారులు చెప్పిన ధరకే ఇవ్వాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరా కొర్రసాగుకు రూ.7 వేల నుంచి 10వేల వరకు ఖర్చు వస్తుందని రైతలు అంటున్నారు. ధరలేక పోవడంతో పెట్టిన పెట్టుబడులు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థుల శ్రమదానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల, యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పట్టణంలోని రంగనాథస్వామి దేవస్థాన ఆవరణం, సంత మార్కెట్‌లో శ్రమదానం చేశారు. ఆయా ప్రాంతాలలో పేరుకపోయిన చెత్తా చెదారాల ను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం నల్లపురెడ్డిపల్లె గ్రామాన్ని సందర్శించి అక్కడ పారిశుధ్య పను లు చేపట్టారు. వైవీయూ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కళ్యాణిరెడ్డి కళాశాల వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ అంటోనీ స్వామి, ప్రిన్సిపాల్ ఆమల్ ఆరోక్యరాజు, వైస్ ప్రిన్సిపాల్ వన చిన్నప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయండి



రాణితోపు పార్కు వద్ద అసంపూర్తిగా ఉన్న ఇరుకు రోడ్డు



పాత ఆర్టీసీ బస్టాండు వద్ద అడ్డంగా ఉన్న డివైడర్స్

పులివెందుల టౌన్ : పులివెందులలో ఎక్కడ చూసినా ఆసంపూర్తిగానే పనులు దర్శనమిస్తున్నాయి. కేవలం కొద్దిపాటి నిధులను వెచ్చించి వీటిని సరి చేయవచ్చని ప్రజలు అంటున్నారు. రాణితోపు పార్కు వద్ద ఒక సైడు డబల్ రోడ్డు వేశారు.. మరోవైపు కొంతమేరకు రోడ్డు వేయలేదు. దీంతో ఆ దారిన వెళ్లే వాహనదారులు రోడ్డు ఇరుకుగా ఉండటంలో ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే పాత ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న డివైడర్‌ను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇక మున్సిపాలిటీ పరిధిలో కె.వెలమ్మవారిపల్లె, వెంకటాపురం, పెద్దరంగాపురం, బ్రాహ్మణపల్లె, చిన్న రంగాపురం తదితర గ్రామాలలో పరిస్థితి చూస్తే అధ్వాన్నంగా ఉంది. ఇవన్నీ కూడా కేవలం కొద్దిపాటి నిధులతో పూర్తవుతాయి. కానీ నాయకులు వీటిని పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీకి లక్షలాది రూపాయలు పన్నులు కడుతున్న ఆ నిధులు ఏమయ్యాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికై నా రాజకీయ నాయకులు, అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

లింగాల : వెలిదండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి. వెలిదండ్ల ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 10 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు, వెలిదండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి. కర్ణపాపాయపల్లె ఫీడర్ల పరిధిలో రోడ్డు క్రాసింగ్ పోల్స్ మార్చుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు మధ్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ తెలిపారు.

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి

పులివెందుల టౌన్ : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ డి.రాముడు తెలిపారు. గురువారం పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ మెయిన్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 'హైజిన్ కార్నర్'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజు భోజనానికి ముందు, టాయిలెట్‌కి వెళ్లిన తర్వాత సబ్బుతో చేతులు, కాళ్ళు శుభ్రం చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో స్వచ్ఛతా కార్యక్రమం నిరంతరం అమలయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు చేతులు శుభ్రపరిచే ఏడు రకాల విధానాలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాసులరెడ్డి, డీబీఎస్ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణువర్ధన్, వలంటీర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

వల్లూరు (చెన్నూరు) : అనారోగ్య సమస్యతో బాధపడుతున్న చెన్నూరు మండల తహసీల్దార్ జీవన్‌చంద్రశేఖర్‌ను మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి గురువారం కడపలోని ఆస్పత్రిలో పరామర్శించారు. వైద్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఉప్పరపల్లి ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, పీఏ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ముకుందరెడ్డి



ముద్దనూరు : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అలవలపాటి ముకుంద రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ముద్దనూరు ఎంపీడీవోగా నియమితులయ్యారు. గతంలో ఆయన గండి క్షేత్రం కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వర్తించారు. మండలస్థాయిలో జరిగి అభివృద్ధి పనులను వేగవంతంచేస్తానని తెలిపారు.

నూతన కమిషనర్‌గా వెంకట్రామి రెడ్డి



జమ్మలమడుగు: మున్సిపాలిటి నూతన కమిషనర్‌గా వెంకట్రామిరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన ప్రమోద్‌కుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కడప కార్పొరేషన్ మేనేజర్‌గా ఉన్న వెంకట్రామిరెడ్డి వచ్చారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు



వైద్యులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప

జమ్మలమడుగు : గూడెంచెరువు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయడంతోపాటు వారికి అవగాహన కల్పించడం ఎంతో మంచిదన్నారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎక్కువగా జలుబు, దగ్గు, జ్వరాల బారినపడి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి

వేంపల్లె : జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు వేంపల్లి శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. పులివెందుల నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ గేమ్స్ నుండి జిల్లాస్థాయికి చెస్ అండర్ 14 విభాగంలో టీ.తనుశ్రీ 1 వ ప్లేస్, అండర్ 17 విభాగంలో వై.పార్వతి 1 వ ప్లేస్ ఎంపికయ్యారన్నారు. పీఈటీ మాస్టర్స్ సోమసుందర్‌రెడ్డి, కృష్ణప్రసాద్‌లను, ఎంపికై న విద్యార్థులను ప్రశంసించారు. మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డిలు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు వేంపల్లి స్వామి వివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎస్.రామాంజనేయరెడ్డి తెలిపారు. గురువారం గండి గురుకుల పాఠశాల మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల ఎంపికలో తమ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలికల, బాలుర జట్లకు పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. అండర్ 14 బాలికల విభాగంలో సి. హాసిని, వి.ప్రమీల.. బాలుర విభాగంలో కె.రేవంత్‌కుమార్‌రెడ్డి, ఎస్.మహమ్మద్ సాహిల్‌లు ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో బాలికల జట్టుకు కె.సాహిత్య, ఎస్.భానులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ తెలియజేశారు. వీరు ఎంపిక కావడంపట్ల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు హర్షాతిరేకములు వ్యక్తం చేశారు. అకుంఠిత కృషితో మంచి శిక్షణతో విద్యార్థులు ఎంపికకు కారకురాలైన పిఈటీ పద్మజను ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బాలుర విభాగంలో హైజంప్ అంశంలో ఓంతేజ మొదటిస్థానం, గోపీచంద్ మూడవ స్థానంలో, లాంగ్ జంప్ పోటీలో పునీత్ రెండవ స్థానం, అండర్-17 విభాగంలో వెంకటతేజ మొదటి స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, ఫిజికల్ డైరక్టర్ మాధవరెడ్డిలు తెలిపారు.

పోటీ పరీక్షలతో నైపుణ్యం తెలుస్తుంది



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం, తదితరులు

వేంపల్లె : పోటీ పరీక్షలలో విద్యార్థులు పాల్గొనడం వల్ల నైపుణ్యత తెలుస్తుందని పాఠశాల హెచ్ఎం శివమునెమ్మ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛత-పరిశుభ్రతపై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఇలాంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులు విరివిగా హాజరు కావాలని, విద్యార్థులలో ఆసక్తి పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం చిత్ర లేఖనం పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్ఎం అభినందించారు.